సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శుక్రవారం । 3 । మే । 2024



ఓటర్లను ప్రలోభ పెడితే చర్యలు

ఓటర్లను ప్రలోభ పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. 8లో



జగనన్నతోనే భవిష్యత్తు

జగనన్నతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని రంపచోడవరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. 8లో



వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. 8లో

న్యూస్‌రీల్

పింఛన్ల పంపిణీలో జిల్లాకు అగ్రస్థానం

- 98.12 శాతంతో రాష్ట్రంలో ప్రథమస్థానం
- కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: ఎన్నికల నియమావళికి లోబడి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో 98.12శాతంతో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎం.విజయసునీత గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. డోర్ టూ డోర్ డెలివరీకి సంబంధించి సాయంత్రం 6.30 వరకు 93.87 శాతంతో రాష్ట్రంలో నాల్గోవ స్థానం, డీబీటీ విధానంలో 98.85 శాతం మేర పంపిణీతో ద్వితీయ స్థానం సాధించామన్నారు. జిల్లాలో 1,27,435 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు. వీరిలో 1,08,626 మందికి బ్యాంకు ఖాతాల్లో పింఛను నగదు జమచేశామన్నారు. మిగిలిన 18,809 మందికి వారి ఇళ్ల వద్దే పంపిణీ చేపట్టామన్నారు.అలాగే జిల్లాకు సంబంధించి డోర్ టూ డోర్ పింఛన్ల పంపిణీలో 98.01శాతం మంది లబ్ధిదారులకు పింఛను నగదు పంపిణీ చేసి ముంచంగిపుట్టు మండలం మొదటి స్థానంలో నిలిచిందన్నారు. జి.మాడుగుల,హుకుంపేట మండలాలు రెండు మూడు స్థానాలు సాధించాయన్నారు. శుక్రవారం నాటికి అన్ని మండలాల్లో నూరుశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

రంపచోడవరంలో రెండు పోస్టల్ బ్యాలెట్ సెంటర్ల ఏర్పాటు

రంపచోడవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు రంపచోడవరం అసెంబ్లీ ఆర్వో ఎస్. ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఈ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న రిటర్నింగ్ అధికారి అభిషేక్

అరుకులోయ రూరల్: రెండోవిడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో విధులు నిర్వహించే సిబ్బంది, రూట్ అధికారులకు ఈవీఎంల వినియోగంపై ఆర్వో అభిషేక్ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించాల్సిన బాధ్యత రూట్ అధికారులపై ఉందన్నారు. ప్రతిఒక్కరు విధుల్లో భాగస్వాములై ఈవీఎంలపై అవగాహన పొందాలని సూచించారు. పోలింగ్ సమయంలో సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఠారెత్తించిన భానుడు

- వడగాడ్పులకు అల్లాడిన జనం
- చింతపల్లిలో 38, మినుములూరులో 37, అరకులో 34.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు



అరకులోయ జనసంచారం తక్కువగా ఉన్న మెయిన్‌రోడ్డు

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా ఎండలు విజృంభిస్తున్నాయి. ఉదయం ఎనిమిది గంటల నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండడంతో చల్లటి ప్రాంతం కాస్త ఉడికిపోతుంది. చింతూరు, ఎటపాక, కూనవరం ప్రాంతాల్లో ఎండతీవ్రగా మరింత ఎక్కువా ఉంది. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 38డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 36డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 34.9డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండతీవ్రత తగ్గడం లేదు. వేసవి సెలవుల్లో సందడిగా ఉండే పర్యాటక ప్రాంతాలు గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు వెలవెలబోతున్నాయి. పాడేరు, అరకు, రంపచోడవరంలో ప్రధాన జంక్షన్లు జన సంచారం లేక వెలవెలబోయాయి.

బాబూ.. నీ నిర్వాకం చూడు..

పండుటాకులు విలవిల

ప్రభుత్వం అందిస్తున్న పింఛను నగదు ఇంటికి రాకుండా అడ్డుకున్న టీడీపీ వైఖరిపై పండుటాకులు, వితంతువులు మండిపడ్డారు. ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛన్ ఇచ్చే వలంటీర్ వ్యవస్థ ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలకు దూరమవడంతో వారంతా అసహనానికి గురయ్యారు. నగదు తీసుకునేందుకు మండుటెండలో బ్యాంకులకు వెళ్లిన పింఛనుదారులు రోజంతా పడిగాపులు పడ్డారు. కన్నబిడ్డల మాదిరిగా వలంటీర్లు తమ వద్దకు వచ్చి పింఛను ఇచ్చేవారని.. ఇప్పుడు వారిని తొలగించడంతో ఈ దుస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన ప్రతిపక్షాల వైఖరిపై వారంతా ధ్వజమెత్తారు.

- పింఛను పొందేందుకు బ్యాంకుల వద్ద పడిగాపులు
- మండుటెండలో సమస్యలు ఎదుర్కొన్న వృద్ధులు, వితంతువులు
- వలంటీర్లను లేకుండా చేయడం వల్లే ఈ దుస్థితి
- మాపై ఎందుకంత కక్ష చంద్రబాబూ.. అంటూ ఆగ్రహం



హుకుంపేటలో బరోడా బ్యాంకు వద్ద పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

సాక్షి,పాడేరు: ప్రతినెలా హాయిగా ఇంటివద్ద పింఛను పొందే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేసినట్టు అధికారులు చెప్పడంతో జిల్లా వ్యాప్తంగా పింఛనుదారులు మండుటెండలో సంబంధిత బ్యాంకులకు చేరుకున్నారు. బ్యాంక్ ఖాతాలు నిర్వహణ లోపం కారణంగా చాలా వరకు వినియోగంలో లేవు. దీంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లాలోని 52 బ్యాంకుల పరిధిలో 1,08,626 మంది పింఛనుదారుల ఖాతాల్లో అధికారులు నగదు జమ చేశారు. కదల్లేని స్థితిలో ఉన్న 18,809 మందికి ఇళ్లవద్ద అందించేలా ఏర్పాట్లు చేశారు. బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ అయినప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా ఇబ్బందులు పడ్డారు. వలంటీర్ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యాయని, ఇదంతా ప్రతిపక్షాల కుట్ర అని పింఛనుదారులు దుయ్యబెట్టారు.

చింతూరు: మండలంలో 5,169 మంది పింఛనుదారులు ఉండగా వీరిలో 4,419 మంది బ్యాంక్ ఖాతాల్లో నగదు అధికారులు జమచేశారు. మిగతా 750 మందికి ఇళ్లవద్దకు వెళ్లి ఇచ్చేలా గ్రామ సచివాలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మండలంలో కేవలం చింతూరు, మోతుగూడెంలో మాత్రమే బ్యాంకులు ఉన్నాయి. దీంతో సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని మల్లంపేట, నర్సింగపేట, అల్లిగూడెం, దొంగలజగ్గారం వంటి మారుమూల గ్రామాల నుంచి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వృద్ధులు, వితంతువులు అవస్థలు పడుతూ చింతూరులోని బ్యాంకులకు వచ్చి పింఛనుసొమ్ము తీసుకున్నారు. రానుపోను రూ.200 నుంచి రూ. 300 వరకు ఖర్చయిందని వారు వాపోయారు.

హుకుంపేట: పింఛను పొందేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాకు వచ్చారు. ఎండతీవ్రతకు ఇబ్బందులు పడ్డారు. వలంటీర్లను లేకుండా చేసిన చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెబుతామని వారు హెచ్చరించారు.

అనంతగిరి: పింఛను పొందేందుకు కాశీపట్నం ఎస్‌బీఐ వద్ద పింఛనుదారులు పడిగాపులు పడ్డారు. మండలంలో 6,156 పింఛను ఉండగా వీటిలో 5,311 పింఛన్ల సొమ్మును వారి ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయగా 845 మందికి నేరుగా వెళ్లి అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. దీంతో పింఛను సొమ్ము తీసుకునేందుకు వృద్ధాప్య పింఛనుదారులంతా కాశీపట్నం ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద రోజంతా పడిగాపులు పడ్డారు.



ముంచంగిపుట్టులో గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట చెట్టు నీడన నిరీక్షిస్తున్న పింఛనుదారులు



పాడేరులోని బ్యాంక్ సర్వీసు సెంటరు వద్ద ఎండలో వేచి ఉన్న పింఛనుదారులు



చింతూరులో పింఛనుదారులతో కిక్కిరిసిన ఎస్‌బీఐ బ్యాంచ్



కాశీపట్నం ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

35 కిలోమీటర్ల నుంచి వచ్చా



పింఛను సొమ్ము బ్యాంకు నుంచి తీసుకునేందుకు సుమారు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతూరు వచ్చా. పేగ నుంచి ఆటోలో ఏడుగురాళ్లపల్లి చేరుకుని అక్కడినుంచి బస్సులో చింతూరు వచ్చి బ్యాంకులో నగదు తీసుకున్నా. రవాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.350 వరకు అయ్యాయి.

– సోడె రామయ్య, పేగ, చింతూరు మండలం

వలంటీరు సేవలే కావాలి



గతంలో ఒకటో తేదీకల్లా వలంటీర్లు ఉదయమే పింఛను సొమ్ము ఇంటికి తెచ్చి ఇచ్చేవారు. వలంటీర్లను తొలగించడంతో పింఛను సొమ్ముల కోసం చాలా ఇబ్బందులు పడుతున్నాం. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మళ్లీ మాకు వలంటీర్ల సేవలు అందుతాయి.

– మడకం సోమమ్మ, లచ్చిగూడెం, చింతూరు మండలం

ఇబ్బంది పెట్టడం సరికాదు



ఇంటికి వచ్చి ఇచ్చే పింఛన్లను రాజకీయ కక్షతో అడ్డుకుని రాకుండా చేశారు. ఇప్పుడేమో పింఛను సొమ్ముల కోసం ఎన్నో కష్టాలు పడుతున్నాం. పింఛను సొమ్ము కోసం 35 కిలోమీటర్లు దూరంలోని చింతూరు వచ్చా. వృద్ధాప్యంలో ఇన్ని ఇబ్బందులు పెట్టడం సరికాదు.

– కూర తమ్మయ్య, పేగ, చింతూరు మండలం

రెండు గంటల వరకు వేచి ఉన్నా..



పింఛను పొందేందుకు ఎన్నడూలేని విధంగా ఇబ్బందులు పడ్డాం. వలంటీర్లు ఇంటికి వద్దకు తెచ్చి పింఛను ఇచ్చేవారు. ఒకటో తేదీకల్లా అందడంతో ఆర్థిక అవసరాలు తీర్చుకునేవాళ్లం. ఉదయం 10 గంటలకు బ్యాంక్‌కు వస్తే మధ్యాహ్నం 2 గంటలకు పింఛను తీసుకున్నా.

– బి.పరశురాం, దోనిపుట్టు, జరెల, మంచంగిపుట్టు మండలం

నగదు లేక ఇంటికి వెళ్లిపోయా



పింఛను తీసుకునేందుకు ఆటో కట్టించుకుని మండల కేంద్రం ముంచంగిపుట్టులోని బ్యాంక్‌కు వెళ్లా. డబ్బులు తీసుకురావడానికి బ్యాంక్ అధికారులు పాడేరు వెళ్లారని చెప్పారు. గంటల తరబడి వేచి ఉన్నా.. వారు రాకపోవడంతో పింఛను తీసుకోకుండానే ఇంటికి వెళ్లిపోయా.

– కొర్ర సోమి, సరియాపల్లి,బంగారుమెట్ట పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

ఖాతా డెడ్ అయిందన్నారు



పింఛన్ సొమ్ము పొందేందుకు ఉదయాన్నే పాడేరులోని ఎస్‌బీఐకు వెళ్లాను. బ్యాంకు పుస్తకం చూపిస్తే పరిశీలించిన సిబ్బంది తన ఖాతా డెడ్ అయిందన్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు జెరాక్స్ కాపీలు తెమ్మన్నారు.అవన్ని అందజేస్తే మళ్లీ బ్యాంకు ఖాతాను పునరుద్ధరించిన తరువాత పింఛన్ సొమ్ము జమచేస్తామన్నారు.

– షేక్ బీబీ, చింతలవీధి, పాడేరు మండలం

వలంటీర్లను అడ్డుకోవడం సరికాదు



వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి పింఛను తీసుకువచ్చి ఇచ్చేవారు. దీని వల్ల మాలాంటి వృద్ధులకు ఎంతో మేలు జరిగేది. ఇలా సేవ చేస్తున్న వారిని నిబంధనల పేరుతో అడ్డుకోవడం సరికాదు. పింఛను పొందేందుకు రెండు నెలల నుంచి ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. పింఛను సొమ్మే జీవనాధారం. మాలాంటి వాళ్లను ఇబ్బందులు పెట్టడం సరికాదు.

– ఎం.మహలక్ష్మమ్మ, వృద్ధురాలు, చింతలవీధి, పాడేరు మండలం

ముంచంగిపుట్టు: మండలంలో 23 పంచాయతీల పరిధిలోని పింఛనుదారులు నానా ఇబ్బందులు పడ్డారు. మండలంలో 5,455 మంది పింఛనుదారులకు వారి బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. వీటిని తీసుకునేందుకు ఉదయం 10 గంటలకు స్థానిక గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు వచ్చారు. గంటల తరబడి బారులు తీరారు. కస్టమర్ సర్వీసు పాయింట్ల వద్ద రద్దీ నెలకొంది. బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం చేయకపోవడంతో పింఛను నగదు అందక నిరాశతో వెనుదిరిగారు.



పింఛను నగదుకోసం ముంచంగిపుట్టులో చెట్టునీడన వేచి ఉన్న పింఛనుదారులు

అడ్డతీగల: స్థానిక యూనియన్ బ్యాంక్ గురువారం పింఛనుదారులతో కిటకిటలాడింది. బ్యాంకులో ప్రభుత్వం జమచేసిన పింఛను సొమ్మును తీసుకునేందుకు వృద్ధులు, వితంతువులు, వికలాంగులు బారులుతీరారు. కొందరికి బయోమెట్రిక్ వేలిముద్రలు మ్యాచ్ కాకపోవడం, మరికొందరికి ఆధార్ నంబరుకు బ్యాంక్ ఖాతా లింక్ లేకపోవడం, ఇంకొందరికి బ్యాంక్ ఖాతాలు సస్పెన్షన్‌లో ఉన్న నేపథ్యంలో పింఛను అందని పరిస్థితి నెలకొంది. దీంతా వారంతా నిరాశతో వెనుదిరిగారు.



అడ్డతీగల యూనియన్ బ్యాంక్ వద్ద పింఛను కోసం పింఛనుదారుల పడిగాపులు

చింతపల్లి రూరల్: వృద్ధులు పింఛను తీసుకునేందుకు గురువారం స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద పడిగాపులు కాశారు. ఎండలో ఎన్నో కష్టాలు పడ్డారు. మండలం మొత్తంమీద ఒక్క బ్యాంక్ ఉండటం వల్ల అన్ని పంచాయతీల నుంచి ఎన్నో అవస్థలు పడి పింఛనుదారులు ఇక్కడికి వచ్చారు. బ్యాంక్ ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేకపోవడంతో సుమారు రూ.500 వరకు కోతపడింది. బ్యాంక్ ఖాతాలు సస్పెన్షన్‌లో ఉండటంతో పింఛను సొమ్ము అందక నిరాశతో వెనుదిరిగారు.



చింతపల్లి యూనియన్ బ్యాంక్ వద్దకు పింఛను కోసం వచ్చిన వృద్ధులు

మిన్నంటిన జగన్నినాదం



బైక్ ర్యాలీలో భారీగా పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



అభివాదం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు, ఎంపీ మాధవి, చెట్టి వినయ్

- కొయ్యూరులో వైఎస్సార్‌సీపీ భారీ బైక్ ర్యాలీ
- మండుటెండను లెక్కచేయకుండా తరలివచ్చిన పార్టీ శ్రేణులు

కొయ్యూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా కొయ్యూరులో గురువారం వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిర్వహించిన బైక్‌ర్యాలీలో జగన్నినాదం మిన్నంటింది. ప్రత్యర్థి రాజకీయ పార్టీల్లో దడ పుట్టించింది. మండుటెండను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో శ్రేణులు తరలిరావడంతో సందడి నెలకొంది. జై జగన్ నినాదాలతో చింతలపూడి నుంచి కొయ్యూరు వరకు ర్యాలీ భారీగా సాగింది. అరకు ఎంపీ మాధవి, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి ఎం.విశ్వేశ్వరరాజు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శెట్టి వినయ్ ఈ ర్యాలీకి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి, అభ్యర్థి విశ్వేశ్వరరాజు, అరకు పార్లమెంట్ అభ్యర్థి గుమ్మ తనూజారాణి భర్త వినయ్ మాట్లాడారు. ఐదేళ్ల పాలనలో అర్హతే ప్రామాణికంగా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఆయనను ఎదుర్కొనే సత్తా లేని చంద్రబాబు అమలు కాని హామీలతో మేనిఫెస్టోని ప్రకటించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆయన మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీగా తనూజారాణిని, ఎమ్మెల్యేగా విశ్వేశ్వరరాజును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, జెడ్పీటీసీ వారా నూకరాజు, నేనుసైతం చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్, వైస్ ఎంపీపీలు అప్పన వెంకటరమణ, అంబటి నూకాలు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు, చింతపల్లి ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు రేగటి ముసిలినాయుడు, సచివాలయ కన్వీనర్ సుధాకర్, ట్రైకార్ డైరెక్టర్ సుమర్ల సరస్వతి, పీఏసీఎస్ పర్సన్ ఇంచార్జీ సూరిబాబు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ పొట్టిక పోతురాజు పాల్గొన్నారు.



ఫ్యాన్ గాలికి టీడీపీ కనుమరుగు

టీడీపీ నేత దొన్నుదొర మద్దతుదారులకు పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, సుభద్ర, హైమావతి 8లో

విహారంలో విషాదం

సరదాగా గడిపేందుకు వచ్చిన స్నేహితుల్లో ఇద్దరి ప్రాణాలను సీతపల్లి వాగు బలిగొంది. స్నానం చేసేందుకు దిగిన వారిని మృత్యువు వాగు రూపంలో కబళించడంతో విహారం కాస్తా విషాదంగా మారింది. ఆయా కుటుంబాలకు దిక్కులేకుండా చేసింది

- సీతపల్లి వాగులో స్నానం చేస్తుండగా ప్రమాదం
- నీట మునిగి ఇద్దరు మృతి





సీతపల్లి వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయిన యువకులు

రంపచోడవరం: సీతపల్లి వాగు వద్ద సరదాగా గడిపేందుకు వచ్చిన స్నేహితుల్లో ఇద్దరు ప్రమాదానికి గురయ్యారు. వాగులో దిగి స్నానం చేస్తుండగా మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారు. స్థానికులు వారిని కాపాడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. గురువారం చోటుచేసుకున్న ఈ విషాద ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా సామర్లకోట గ్రామానికి చెందిన వర్ధనపు రాజ్‌కుమార్(29), వాస అవినాష్(27), మరో నలుగురి స్నేహితులతో కలిసి సరదాగా గడిపేందుకు గురువారం ఇక్కడికి సమీపంలోని ఐ పోలవరం వద్ద సీతపల్లి వాగు వద్దకు వచ్చారు. ఇదే ప్రాంతంలోని వంతెన దిగువ వైపున వారు స్నానానికి దిగారు. ముసురుమిల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా నీరు ఎక్కువగా ఉన్నచోట దిగడంతో ప్రమాదానికి గురయ్యారు. వీరిలో రాజ్‌కుమార్, అవినాష్ మునిగిపోతుండగా మిగిలిన స్నేహితులు కేకలు వేశారు. దీంతో సమీపంలో ఉన్న స్థానికులు వెంటనే వాగు వద్దకు వచ్చి వారిని కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎట్టకేలకు స్థానికులు మృతదేహాలను బయటకు తీశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సీతపల్లి వాగులో మునిగి రెండేళ్ల కాలంలో పది మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడ లోతైన ప్రాంతం ఉన్నందున పోలీసులు స్నానాలను నిషేధించారు. అయినా పట్టించుకోకుండా వాగులోకి దిగి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు.

నేటి నుంచి చందనోత్సవ టికెట్ల విక్రయాలు

- దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: ఈ నెల 10న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి దర్శన టికెట్ల విక్రయాలు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఈ నెల 7వతేదీ వరకు సాయంత్రం 5గంటల వరకు విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. సింహాచలం, మహారాణిపేట, అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లు, సింహాచలం, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం బ్రాంచ్), బిర్లా జంక్షన్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లతో పాటు సింహాచలం కొండపైన ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా రూ.300, రూ.1000 టికెట్లతో పాటు రూ.1500 టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ఎటపాక : అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సీతాపురం గ్రామంలో జరిగింది. సిలిగం సతీష్ (31) తన అవసరాల కోసం కొందరి వద్ద అప్పు తీసుకున్నాడు. సుమారు రూ.నాలుగు లక్షల వరకు ఉన్న అప్పు తీర్చే మార్గం లేక బుధవారం రాత్రి పురుగు మందు తాగాడు. అతడిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అప్పు ఇచ్చి వేధింపులకు గురిచేస్తున్న ఇద్దరిపై కూడా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పార్థసారథి తెలిపారు. సతీష్ భద్రాచలంలో కుట్టు మిషన్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

గర్భిణులకు అవగాహన అవసరం


మాజీ మంత్రి బాలరాజు

చింతపల్లిరూరల్: ప్రభుత్వం అందిస్తున్న సేవలపై గర్భిణులు అవగాహన కలిగి ఉండాలని మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అన్నారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ గర్భిణుల కోసం ప్రభుత్వం బర్త్ వెయిటింగ్ హాల్‌లు ఏర్పాటుచేసిందన్నారు. అక్కడ ముందస్తుగా చేరి సేవలు పొందవచ్చన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులకు అవగాహన లేక అంబులెన్స్‌లో ప్రసవాలు వంటిని చోటుచేసుకుంటున్నాయన్నారు. గర్భిణులకు అవగాహన కల్పించేందుకు టీమ్ ఏర్పాటుచేసేందుకు యోచిస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం


కూలీకి మట్టి అందిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం


వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్పర్సన్ సుభద్ర, అరకు నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు హైమావతి

అరకులోయ రూరల్/అరకులోయ టౌన్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేద్దామని అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు నియోజకవర్గం పార్టీ పరిశీలకురాలు హైమావతి అన్నారు. పట్టణంలోని సీ కాలనీ, బీ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వారు పాల్గొన్నారు. గ్రామస్తులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న సుపరిపాలన అందిస్తున్నారన్నారు. పారదర్శకంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న పాలన ఆదర్శంగా నిలిచిందన్నారు. జగనన్న ప్రభుత్వంలో మన్యంలో శరవేగంగా అభివృద్ధి జరిగిందన్నారు. శివారు గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపిన ఘనత జగనన్నదేనన్నారు. జగనన్నకు అందరూ అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తూ పాలన అందిస్తున్నారన్నారు. అరకు నియోజకవర్గం పార్టీ పరిశీలకురాలు హైమావతి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేశారని, సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మొద్దన్నారు. వారంతా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనూజారాణి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగంను భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామస్తులను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, ఎంపీపీ ఉషారాణి, స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, పిఏసీఎస్ డైరెక్టర్ పుష్ప, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నారావు, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, పార్టీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, మండల మహిళ అధ్యక్షురాలు సుమిత్ర, సర్పంచ్ సుస్మిత, నాయకులు విజయ్‌కుమార్, కుమారి, పూర్ణ, అర్జున్, తిరుపతి, సాంబ, నర్సింగ్, రఘు పాల్గొన్నారు.

ఫ్యాన్ గాలికి టీడీపీ కనుమరుగు

- అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం
- టీడీపీ నేత దొన్నుదొర అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానం

అరకులోయ రూరల్: ఫ్యాన్ గాలికి టీడీపీ కనుమరుగు అయ్యే పరిస్థితి నెలకొందని అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అన్నారు. అరకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర అనుచరులు, ఆ పార్టీ నేతలు జన్ని రాజు,శంకర్,అప్పన్నతోపాటు పెదలబుడులో టీడీపీకి చెందిన 55 కుటుంబాలు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు హైమావతి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర వీరికి పార్టీ కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. పార్టీలకు అతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందించడం తమకు ఎంతగానో నచ్చిందని అందువల్లనే టీడీపీ నుంచి బయటకు వచ్చేశామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధిని చూసి టీడీపీకి గుడ్‌బై చెప్పి తమ పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉషారాణి, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పాలు, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, పీఏసీఎస్ డైరెక్టర్ పుష్ప, స్వచ్ఛంద్రా కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే భవిష్యత్తు


చింతలపూడి పంచాయతీ బంగారుబందలు గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రంపచోడవరం అసెంబీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి

వై.రామవరం: జగనన్నతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు అని రంపచోడవరం ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చింతలపూడి పంచాయతీ చింతకొయ్యి, బంగారుబందలు, తదితర గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడారు. గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీలను మాటతప్ప కుండా అమలు చేశారన్నారు. చంద్రబాబు బూటకపు హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దన్నారు. చంద్రబాబు ధనికులకు అనుకూలమన్నారు. జగనన్నది పేదల ప్రభుత్వమని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పింఛను మంజూరుకు నాయకులు, అధికారులకు లంచా ఇవ్వాల్సి వచ్చేదన్నారు. పేదల సంక్షేమ పథకాలను టీడీపీ జన్మభూమి కమిటీల సభ్యులు కాజేసేవారన్నారు. చంద్రబాబు కుట్రవల్లే సేవలకు వలంటీర్లు దూరమయ్యారన్నారు. పింఛనుదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఎన్నికల్లో ఆయనకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థిగా తనను, అరకు ఎంపీ అభ్యర్థిగా తనూజారాణిని గెలిపించాలని ఆమె కోరారు. సీఎం జగనన్న ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు ముర్ల జోగిరెడ్డి, వలాల విశ్వమ్మ, ఎంపీటీసీలు వీరమళ్ల సుబ్బలక్ష్మి, సాదాల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చక్రస్నానం


శ్రీవారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు,జూపల్లి రామేశ్వరరావు,కుమారి దంపతులు

- మైహోం ఇండస్ట్రీస్‌లో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

యలమంచిలి రూరల్: ములకలాపల్లి మైహోం ఇండస్ట్రీస్ సిమెంటు కర్మాగారంలో వ్యూహలక్ష్మీ సమేత వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. వైభవోపేతంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో చివరి అంకమైన చక్రస్నాన ఘట్టాన్ని వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కనులపండువగా నిర్వహించారు. అంతకుముందు ఉదయం యాగశాలలో నిత్యారాధన,చతుస్థానార్చన,మూలమంత్ర జపానుష్ఠాన పారాయణ, మహాపూర్ణాహుతి, అష్టోత్తరశత కలశాభిషేకం జరిగాయి. చక్రస్నానం తర్వాత తీర్థప్రసాదగోష్టి, ఉత్సవ సమాప్తి నిర్వహించారు. రాత్రి 7 గంటలను శ్రీవారికి ఊంజల్ సేవ జరిపారు.ఈ సందర్భంగా భక్తుల గోవిందనామస్మరణతో వీధులన్నీ మారుమోగాయి. 30 మంది వేదపండితులు, విజయవాడ వేద పాఠశాల నుంచి త్రిదండి చినజీయర్ స్వామి శిష్య బృందం,ఆలయ ప్రధానార్చకులు వెంకటకృష్ణమాచార్యులు తదితరులు చక్రస్నాన క్రతువును శాస్త్రోక్తంగా పూర్తిచేశారు. కార్యక్రమంలో మైహోం గ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర రావు, కుమారి దంపతులు, ఫ్యాక్టరీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (వర్క్స్) వీహెచ్ చౌదరి,మైహోం డైరెక్టర్ (ఆపరేషన్స్) పి.ఎస్. పాండే,పలువురు ఉద్యోగులు,కార్మికులు,పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఐటీఐలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: లైట్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ కళాశాల) ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, లైట్ వెహికల్ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93735 57529, 91779 67397 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపటి నుంచి తొలివిడత చందనం అరగదీత

సింహాచలం: సింహగిరిపై శనివారం నుంచి తొలివిడత చందనం అరగదీత కార్యక్రమం నిర్వహించేందుకు దేవస్థానం వైదికులు, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 10న చందనోత్సవం సందర్భంగా స్వామి వారి నిజరూప దర్శనం అనంతరం తొలివిడతగా సమర్పించే మూడు మణుగుల చందనాన్ని (సుమారు 125 కిలోల పచ్చిచందనం) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 4న ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం తొలిచందనం చెక్కకు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం, నాల్గో తరగతి సిబ్బంది చందనాన్ని అరగదీస్తారు. ఈ మేరకు గురువారం ఆలయ బేడా మండపంలో చందనం చెక్కలను ముక్కలుగా కోసి అరగదీతకు అనుగుణంగా సిద్ధం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్ వెంకటరమణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.


చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న దేవస్థానం సిబ్బంది

ఆర్టీసీ డ్రైవర్‌పై గుర్తు తెలియని యువకుల దాడి

బుచ్చెయ్యపేట: అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై గుర్తు తెలియని యువకులు దాడి చేశారు. గురువారం సాయంత్రం అనకాపల్లి డిపో నుంచి ప్రయాణికులతో మాడుగులకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. మద్యంమత్తులో ఉన్న ముగ్గురు యువకులు విజయరామరాజుపేట తాచేరు వంతెన వద్ద ఆర్టీసీ బస్సు ముందు తమ బైక్ నిలిపారు. దీంతో డ్రైవర్ కేకే రావు బస్సు ఆపడంతో లోపలికి ప్రవేశించి ఆయనపై దాడి చేశారు. అంతేకాకుండా మరో వ్యాన్ అద్దాలు కూడా పగలగొట్టి, డ్రైవర్‌పై దాడి చేశారు. ఈ సంఘటన అనంతరం ఆర్టీసీ బస్సు సిబ్బంది ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానాలకు చేర్చారు. ఆర్టీసీ డ్రైవర్ బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

2600 లీటర్ల సారా పులుపు ధ్వంసం


స్వాధీనం చేసుకున్న డమ్ములతో ఎస్‌ఈబీ అధికారులు

పాయకరావుపేట: రెండు ప్రాంతాల్లో దాడులు చేసిన 2,600 లీటర్ల సారా పులుపు ధ్వంసం చేసినట్టు ఎస్‌ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. మండలంలోని పాల్తేరు శివారు చెరువు వద్ద దాడులు నిర్వహించి 1,000 లీటర్లు, కాకినాడ జిల్లా తొండంగి మండలం యల్లయ్యపేట సమీపంలో సముద్రతీర ప్రాంతం వద్ద 1,600 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్టు తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్‌ఈబీ సిబ్బంది, పాయకరావుపేట ఎస్‌ఈబీ ఎస్‌ఐ చిట్టిబాబు సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ చెప్పారు.

భువనేశ్వర్–ఎల్‌టీటీ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు సిద్ధమైందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- భువనేశ్వర్–లోకమాన్య తిలక్ టెర్మినస్(ఎల్‌టీటీ)(08420) రైలు ప్రతి బుధవారం రాత్రి 11 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 6.45కు దువ్వాడ చేరుకుని, తిరిగి 6.50కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌కు చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 26 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో లోకమాన్య తిలక్ టెర్మినస్–భువనేశ్వర్ (08419) రైలు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.45లకు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.50కు బయలుదేరి అదే రోజు మధ్యరాత్రి(ఆదివారం తెల్లవారు) 1.45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

విశాఖ–హతియా స్పెషల్ రైళ్ల రద్దు

విశాఖపట్నం–హతియా– విశాఖపట్నం(08559/08560) మధ్య నడుస్తున్న వీక్లీ సమ్మర్ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను ఇటీవలే వేశారు. జూన్ నెలాఖరు వరకు రాకపోకలు సాగించాలి. ఈ రైలుకు సరైన ఆక్యుపెన్సీ, డిమాండ్ లేనందున రద్దు చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ రైలుకు సరైన సమయంలో వేస్తే డిమాండ్ ఉంటుంది. అనువు కాని వేళల్లో ఈ ట్రైన్ నడుస్తున్నందున ఖాళీగా రాకపోకలు సాగించింది. బొకారో, టాటా ఎక్స్‌ప్రెస్‌ల వేళలకు కొంచెం అటూ ఇటుగా ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరేలా చేస్తే డిమాండ్ ఉంటుందని పలువురు రైల్ యూజర్లు కోరుతున్నారు.

రెండు పూరిళ్లు దగ్ధం


కాలిపోయిన పూరిళ్లు

కొయ్యూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం సాయంత్రం మంప పంచాయతీ తుమ్మలబందలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ప్రమాదంలో ఇంగువ సత్తిబాబు, పాడి గంగరాజులకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో ఒక ఇంట్లో చెలరేగిన మంటలు పక్కనున్న మరో పూరింటికి వ్యాపించాయి. తాటాకుల ఇళ్లు కావడంతో మంటలు విపరీతంగా ఎగిసిపడ్డాయి. మంటలను అదుపు చేయడం కష్టంగా మారిందని స్థానికులు చెప్పారు. ప్రమాదంలో ఇళ్లల్లో ఉన్న వివిధ ప్రతాలు, కార్డులు, ఇతర సామగ్రి మొత్తం కాలిపోయిందని, అధికారులు స్పందించి ఆదుకోవాలని వారు కోరారు. సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. ప్రమాదంలో రెండు ఇళ్లల్లో సుమారు రూ.రెండు లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు.

ఎస్‌ఐపై దాడి కేసులో నలుగురికి రిమాండ్

యలమంచిలి రూరల్: పట్టణ ఎస్‌ఐపై దాడి చేసిన కేసులో నలుగురు నిందితులకు 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్టు యలమంచిలి సీఐ షేక్ గఫూర్ గురువారం తెలిపారు. గత మంగళవారం రాత్రి యలమంచిలి పట్టణానికి సమీపంలో అచ్యుతాపురం బైపాస్ రోడ్డుపై రెండు కార్లు ఢీకొన్న సమయంలో రెండు వర్గాల మధ్య గొడవ జరిగింది. వివాదం కారణంగా నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు అక్కడికి వెళ్లిన పట్టణ ఎస్‌ఐ పాపినాయుడుపై రాంబిల్లి మండలం లాలంకోడూరుకు చెందిన నలుగురు యువకులు దాడి చేశారు. ఎస్‌ఐ పాపినాయుడు ఫిర్యాదు మేరకు లాలం మోహన్,రుత్తల గంగరాజు,లాలం చిరంజీవి అలియాస్ బాబ్జి,లాలం సందీప్‌లపై కేసు నమోదు చేసి, గురువారం స్థానిక ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. వారికి న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

బీచ్ రోడ్డు: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకునే వెసులుబాటు కల్పించిందని ఏయూ ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. http:// employment. ap. gov. in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సేవలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు.

ఓటర్లను ప్రలోభ పెడితే చర్యలు

- చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా
- పోలింగ్ కేంద్రాల సందర్శన
- గిరిజన యువతకు వాలీబాల్ కిట్ల పంపిణీ

మోతుగూడెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుని కేసు నమోదు చేస్తామని చింతూరు ఏఎస్పీ రాహుల్ మీనా హెచ్చరించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.


ఎవరైనా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎన్నికలలో ఓటర్లను ప్రలోభాలు పెట్టడానికి ఎవరైనా ప్రయత్నిస్తే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అక్రమంగా నగదు తరలించడం, మద్యం అమ్మడం వంటివి చేయకూడదని, అలా చేసే వారి సమాచారం పోలీసులకు అందజేయాలని ఆయన కోరారు. తులసిపాక, కొత్తపల్లి, గూడూరు, తూలుగొండ,సుకుమామిడి, మోతుగూడెం, ఫోర్‌బే గ్రామాలను ఏఎస్పీ సందర్శించారు. ప్రతీ గ్రామంలో యువకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మోతుగూడెంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ వచ్చిన తరువాత మోతుగూడెం పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు వందమందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ గోపాలరావు పాల్గొన్నారు.

నదిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

వీఆర్ పురం: బాటిల్‌తో నీరు పట్టుకునేందుకు శబరినదిలోకి దిగి గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..గుర్రంపేట గ్రామానికి చెందిన పులి గంగరాజు(46) బుధవారం గ్రామానికి సమీపంలోని శబరి నది పరివాహక ప్రాంతం వద్ద ఉన్న గున్నంకొండ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తాగేందుకు తెచ్చుకున్న మంచినీళ్లు అయిపోయాయి. దీంతో గంగరాజు ఒక బాటిల్ తీసుకొని నీరు తీసుకొస్తానని చెప్పి శబరి నదిలోకి వెళ్లాడు. నీటి కోసం వెళ్లిన వ్యక్తి రెండు గంటలైనా వెనుతిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అయినా అతడి ఆచూకీ కానరాలేదు. కాగా గురువారం ఉదయం పాతరాజుపేట వద్ద నదిలో గుర్తు తెలియని మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి ఎస్‌ఐ నాగరాజు సిబ్బందితో చేరుకొని ఆ మృతదేహాన్ని పరిశీలించారు. గున్నంకొండ వద్ద గల్లంతైన గంగరాజు మృతదేహమేనని నిర్ధారించారు. మృతిడి భార్య మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి


తాడిపాలెంలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్


రెయ్యలగెడ్డ వంతెన సమీపంలో బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ మనోజ్‌కుమార్

జి.మాడుగుల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలంతా పోలీసులకు సహకరించాలని సీఐ రమేష్, ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. మండలంలో వంజరి పంచాయతీ తాడిపాలెం గ్రామంలో వారు గురువారం పర్యటించి, గిరిజనులకు ఓటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ప్రత్యేక పోలీస్, గ్రేహౌండ్స్ పోలీస్ బలగాలు గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, అల్లర్లు, గొడవలు జోలికి పోవద్దని ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని వారు కోరారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలు, అల్లర్లు, ఎన్నికల నిబంధనలు అతిక్రమించినా వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. గ్రామాల్లో సారా, అక్రమ మద్యం అమ్మినా, తాగి గొడవలకు పాల్పడిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఓటుని సక్రమంగా వినియోగించుకోవాలని వారు కోరారు.

పెదబయలు: మండలంలోని పోలీసులు, సాయుధ దళాలు విస్తృతంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో పెదబయలు నుంచి కొత్తాపుట్టు వరకు బాంబు స్క్వాడ్‌తో రోడ్డు, కల్వర్టుల్లో ఇతర అనుమానిత ప్రదేశాల్లో తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామన్నారు. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. గ్రామాల్లో అనుమానస్పదంగా వ్యక్తులు ఎవరైనా సంచరిస్తుంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.